# గుండె తడి

సుందరానికి ప్రస్తుతం తనున్న పరిస్థితి అయోమయంగా ఉంది. అసహనంగానూ ఉంది. అసలు తనిలాంటి పరిస్థితిలో యిరుక్కోవాల్సి వస్తుందని ఎప్పుడూ ఊహించ నయినా లేదు. తన మీద తనకే జాలి వేసింది. తన మీద తనకే కోపం వచ్చింది. తిక్కగా ఉంది. బహుశా ఎవరూ తన లాగా యిలా తెలివి తక్కువగా ప్రవర్తించరు. ప్రవర్తించి ఇలాంటి లజ్జాకరమైన పరిస్థితులు కొనితెచ్చుకోరు.

అతను ఆ ఎరుపు రంగు గోడల మధ్యకి వచ్చి అప్పుడే దాదాపు నాలుగు గంటలవుతోంది. తనని తీసుకుని వచ్చి అక్కడ కుదేసిన కానిస్టేబిలు మరింక అయిపు లేదు. తనింకా ఈ పోలీస్ స్టేషనులో ఎంత సేపు ఉండాలో తెలీడం లేదు. చివరకి తన పరిస్థితి ఎలా పరిణమించబోతోందో ఊహకి అందడం లేదు. ఈ చిక్కు ముడి విప్పుకోగలడా? ఈ సాలె గూడులోంచి సురక్షితంగా బయట పడగలడా అనే సందేహం అతనిని వేధిస్తోంది. దాహం వేస్తోంది. అవమానంతో, బెంగతో ఆకలి ఎప్పుడో చచ్చిపోయింది. ఎవరయినా కొంచెం మంచి నీళ్ళు యిస్తే బాగుణ్ణు. ఎవరి నడగాలో తెలీదు. అల్లంత దూరంలో, రైటరు కాబోలు, దీక్షగా ఏదో రాసుకుంటూ తల అసలు పక్కలకి తిప్పడమే లేదు. ఒకరో యిద్దరో పోలీసు జవాన్లు అటూ యిటూ తచ్చాడుతున్నప్పటికీ, ఎవరూ తన ఉనికిని గుర్తించడం లేదు.

తను కూర్చున్న బెంచీ మీద అసహనంగా కదిలేడు సుందరం. సన్నగా పొడి దగ్గు దగ్గేడు. అటు వేపు వెళ్తున్న ఓ పోలీసు ఆగి, సుందరం కళ్ళ లోకి సూటిగా చూసేడు. 'ఏం కావాలి బే' అన్నట్టుగా పొగరుగా తలెగరేసాడు. సుందరం భయంతో కుంచించుకు పోయేడు. దాహంతో పిడుచ కట్టి పోతున్న నోరు మరి పెగల్లేదు. సుందరం మాట్లాడకుండా జావ కారి పోవడం చూసి, విజయం వరించిన వీరుడిలా నవ్వుకుంటూ అక్కడి నుండి వెళ్ళి పోయేడు ఆ కానిస్టేబిలు. ఆ ఎర్ర గదిలో సుందరం మళ్ళీ ఒంటరి వాడైపోయేడు. సుందరానికి దు:ఖం గొంతుక లోకొచ్చి గర గరలాడింది.

ఎస్సై వేగిరం వస్తే బాగుండును. తను చెప్పదలుచుకున్నదేదో అతనితోనే చెప్పుకో వచ్చును. వింటే సరే సరి. అతను కూడా తన మాటలు పట్టించుకోకపోతేనో? మొదటి సారిగా ఆ ఆలోచన వచ్చి సుందరం సన్నగా జలదరించుకు పోయాడు. భయం ఒక చిన్న ప్రకంపనలా మొదలై ఉత్తుంగ తరంగమై , కల్లోలిత నీరధిగా మారి , అతని మస్తిష్కాన్ని కుదిపి కుదిపి వదిలింది. ఇంతవరకూ తన గోడు ఎస్సైకి అర్థం అవుతుందనీ, అతను తనని సహృదయంతో అర్థం చేసుకో గలడనే ఆశ చిరు దీపంలా అతనికి ఉండేది.

ఆ ఆశ కూడా ఇప్పుడు సందేహాస్పదమయ్యే సరికి సుందరం పూర్తిగా కృంగి పోయేడు. తల భారంగా తయారయింది. నీరసం కమ్ము కొస్తోంది. నిస్త్రాణగా తల వెనక్కి వాల్చి, బరువుగా కళ్ళు మూసుకున్నాడు.

అసలు తనీ ఊరు ఎందు కొచ్చినట్టు? ఈ ఊళ్ళో తనకేం పనుంది? పనిమాలి ఇక్కడి కొచ్చి, కాలికి బలపం కట్టుకుని పిచ్చి పిచ్చిగా ఊరంతా తగుదునమ్మా అని చుట్ట బెట్టాడు. చివరికేమయింది? ఆ బుర్ర మీసాల పోలీసు దృష్టిలో పడ్డాడు. 'నాకేం తెలియదు మొర్రో, నన్ను వదిలెయ్యి' అని కాళ్ళూ, గెడ్డం పట్టుకుని వేళ్ళాడినా కనికరించ లేదు. చుట్టూ ఉన్న జనం కూడా తనని ఒక గొప్ప దోషిలా చూసారు. సంఘానికి కీడు చేసే తక్షణ శత్రువు లాగా భావించేరు. క్షమించ రాని నేరస్థుడిగా నిర్ణయించేరు. తన లాంటి నేరస్థుడ్ని వెంటనే బొక్కలోకి తోసి, శిక్షించక పోతే శాంతి భద్రతలకి తీవ్ర మయిన అఘాతం ఏర్పడుతుందని తీర్మానించేరు. ఫలితంగా తనిక్కడికి వొచ్చి పడ్డాడు. తిండీ తిప్పలూ లేవు. తన గోడు పట్టించుకునే నాథుడూ లేడు. గుడ్డిలో మెల్ల. తనని తీసు కొచ్చిన పోలీసు తనని నేరుగా కొట్లో తోసెయ్య లేదు. స్టేషన్లోకి తీసు కొచ్చేక, వసారా ముందు గది దాటేక ఈ గది లోకి నడిపించు కొచ్చి పొడవాటి బల్ల మీద కూచోమని శాసించేడు. దేబిరిస్తున్నట్టుగా చివరి ప్రయత్నంగా తను ఏదో అన బోతే పురుగుని దులపరించి నట్టు అదిలించాడు. తన మొర వినే కర్మ తన కేమీ పట్టనట్టుగా ప్రవర్తించాడు. ఏం చేయాలో తోచక ఆ బల్ల మీద చతికిల బడ్డాడు సుందరం. అలా తీసుకుని వచ్చిన తనని ఎప్పుడు వదిలేస్తారో, అసలు వదలరో, జైల్లో పడేస్తారో, లేదా ఏ నేరమో మోపి కోర్టుకి కట్టేస్తారో కూడా తెలీడం లేదు సుందరానికి. సుందరానికి ఏడుపొస్తోంది. అవును. తనని ఏ కారణమూ లేకుండానే ఆ బుర్ర మీసాల పోలీసు లాక్కొచ్చి ఇక్కడ పడేసాడు. కేవలం... కేవలం... అనుమానం మీదే తనని లాక్కొచ్చాడు.

ఈ దేశంలో పోలీసులు తమకి విస్తృతమైన అధికారాలు సంక్రమింప జేసుకున్నారు. ఒక వ్యక్తిని ఏ అభియోగమూ లేకుండానే తెచ్చి, జైల్లో పడెయ్య వచ్చు. నెలల తరబడి వేధించ వచ్చు. అమానుషంగా బాధించ వచ్చు. అసభ్య పదజాలంతో అవమానించ వచ్చు. ఆలోచిస్తున్న కొద్దీ సుందరానికి మెదడు వేడెక్కి పోతోంది.

అసలు తనకీ ఊరు రావాలనే ఆలోచన కలగక పోతే, ఇప్పుడీ అనర్థం జరిగేది కాదు. తనకీ అవస్థ ఏర్పడి ఉండేదీ కాదు. సుందరం ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో అలా అనుకున్నాడే కానీ, అతనీ ఊరు రాకుండా ఎలా ఉండగలడు? ఈ ఊరి మీద అతనికున్న మమకారం రాకుండా ఊరుకోనిస్తుందా? నిజానికి ఇంటి దగ్గర బయలు దేరేటప్పుడు సుందరానికీ ఊరు రావాలనే ఆలోచనే లేదు. కంపెనీ పని మీద ప్రయాణమై వచ్చేడు - ఇక్కడికి ముప్ఫై కిలోమీటర్ల దూరంలో ఉండే పట్నానికి. తీరా తన పని చేసుకుని ఇంటికి తిరిగి వెళ్ళి పోదామనుకుంటూండగా, యథాలాపంగా ఈ గ్రామం పేరు తన చెవిని పడింది. తనీ గ్రామానికి మరీ చేరువలోకి వచ్చేడని తెలిసి, మనసు ఆనందంతో ఉప్పొంగి పోయింది.

ఇది తను పుట్టిన ఊరు. తనకు జన్మ నిచ్చిన స్థలం. బాల్యంలో కొద్ది కాలం ఇక్కడ గడిచిందంతే. తర్వాత ఈ ఊరి ముఖమే చూడలేదు. ఈ గ్రామం పేరు విని,

అనిర్వచనీయమైన ఆనందానుభూతికి లోనయ్యాడు. ఎక్కడో కోస్తా జిల్లాలో ఆ మూల ఉంటున్న తనకి మళ్ళీ ఇంత దూరం వచ్చే అవకాశం చిక్కుతుందన్న ఆశ లేదు.ఖర్చులు కంపెనీ భరిస్తోంది కనక గానీ, తనంత తానుగా డబ్బు ఖర్చు చేసి ఈ ప్రాంతాలకి జీవిత కాలంలో మళ్ళీ వచ్చే అవకాశం శూన్యం. మళ్ళీ మళ్ళీ ఇంత దూరం రాలేడని తనకి తెలుసు. రానూ పోనూ పాతిక రూపాయల ఖర్చుతో పుట్టిన ఊరిని చూడగలిగే భాగ్యం కలుగుతున్నందుకు ఆనందంతో ఊగి పోయాడు. పరవశించి పోయాడు.

ఈ ఊరు...

ఇక్కడే తన తల్లి తనకు జన్మ నిచ్చింది.మొదటి సారిగా తను కనులు విప్పి ఈ లోకాన్ని చూడగలిగింది ఈ నేల తల్లి ఒడిలోనే. ఈ ఊరు పేరు వింటేనే చాలు తన మనసు సంతోషంతో పులకించి పోతుంది. రెక్కలొచ్చిన పక్షిలా ఊహా లోకాల్లోకి ఎగిరి పోతుంది. ఆనందం అర్ణవమౌతుంది. తాత గారిక్కడ ప్రైవేటు డాక్టరుగా ఓ క్లినిక్ నడుపుతూ ఉండేవారు. అప్పట్లో అతనికి 'డాక్టర్ బాబాయ్' గా ఎంతో ప్రసిద్ధి ఉండేది. రోగుల్ని ఎంతో ప్రేమగా స్వంత మనుషులుగా చూసుకునేవారని చెప్పుకునేవారు. తన తండ్రి ఆ ఇంటికి పెద్దల్లుడు. అప్పట్లో ఆ యిల్లు – కొడుకులూ, కోడళ్ళూ, మనుమలూ, మనుమరాళ్ళతో కళ కళలాడి పోతూ ఉండేది. తనిప్పుడు యేభయ్యో పడిలో పడ్డాడు. ఇదంతా ఎప్పుడో, తన చిన్నప్పటి ముచ్చట. అప్పటి సంఘటనలు ఒకటీ అరా తప్ప, తనకసలు గుర్తు లేవు. గుర్తుండే అవకాశమూ లేదు. సెలవుల్లో మూడు రైళ్ళు మారి, అమ్మా నాన్నలతో అమ్మమ్మ గారింటికి, ఈ ఊరు రావడం! ఊరైతే గుర్తు లేదు గాని, ఆ యింటిని తను మరిచి పోలేదు.

బాల్యంలో తన లేత మనసు మీద పడిన ఆ అనుభూతి ముద్రల చిన్నెలు ఎప్పటికీ చెరిగి పోయేవి కావు. గ్రామం, గ్రామంలో ఇతర పరిసరాలూ, వాటి గుర్తులూ తన స్మృతిపథంలో ఏమాత్రం నిలవలేదు. కాని, ఆ యిల్లు బాగా గుర్తు. అనుభూతి వైయక్తికం. అది కలిగించే ఆర్ద్రత కూడా వ్యక్తిగతమే.

విశాలమయిన ఆవరణలో ఉండేదా ఇల్లు. ఇంటి ముందు వెదురు బద్దలతో అల్లిన ఫెన్సింగు. ఇంటి ముందు వేసిన పందిరి మీదకి ప్రాకి, గుబురుగా అల్లుకున్న సన్న జాజి. ఓ ప్రక్కగా తెల్లవారేసరికి గంపెడు పూలను విరబూసే తెల్ల గన్నేరు చెట్టు. నూతి ప్రక్కన క్రోటన్స్. రాత్రి వేళ, వాటి వాసనలు మత్తుగా, గమ్మత్తుగా ఉండేవి. ముఖ్యంగా పెరటి వేపు కొద్ది పాటి దూరంలో ఎత్తయిన మెట్ట ఉండేది. దాని మీద కోతులు యథేచ్ఛగా తిరుగాడేవి. అప్పటి తన పసి మనసుకి వాటి సంఖ్య అసంఖ్యాకంగా తోచేది. అవి చేసే అల్లరి చెప్పనలవి కానిదిగా ఉండేది. విప్పారిన నేత్రాలతో విస్తు పోతూ వాటి ఆగడాలని చూసేవాడు తను. బాల్యంలో అప్పుడా యిల్లూ, దాని పరిసరాలూ తనకొక వింత ప్రపంచం. ఒక డిస్నీ లాండ్! తను పుట్టిన ఆ గ్రామాన్ని ఒక సారి కళ్ళారా చూడాలని అనిపించి వచ్చాడు. దాదాపు అయిదు దశాబ్దాల తరువాత ఆ యింటిని చూడబోవడం – మాటలకీ, ఊహలకీ అందని ఒక అందమైన అనుభవం. మరచి పోలేని మధురమైన అనుభూతి. జీవిత చరమాంకంలో నెమరు వేసుకోడానికి మిగిలే తీయని జ్ఞాపకం.

అందుకే, శరీరం అంతగా సహకరించక పోయినా, డబ్బు చాలీ చాలనట్టుగా ఉన్నా... ఒక విధమైన పట్టుదలతో ఇక్కడి కొచ్చేడు. తెల్లవారు ఝూమునే రైలెక్కి, పొద్దెక్కకుండానే ఈ ఊరు చేరాడు. అనుకోని విధంగా కేంప్ పొడిగించాల్సి వచ్చి బట్టలు బాగా నలిగిపోయినా ఖాతరు చెయ్యలేదు. గడ్డం మాసిందన్న స్పృహ కూడా లేదు. ఈ ఊరు చూడాలనే ఉబలాటంతో రాత్రంతా నిద్ర పట్టక అటూ, ఇటూ దొర్లుతూ గడిపాడేమో - కళ్ళు చింత నిప్పుల్లా తయారయాయి. తనా అవతారంతో ఎవరి కయినా అనుమానాస్పద వ్యక్తిగా తోచవచ్చునని సుందరానికి ఎందు చేతనో తట్టనే లేదు.

రైలు దిగి, ఊళ్ళోకి అడుగు పెడుతూనే స్వర్గంలోకి అడుగు పెట్టిన వాడిలా అనుభూతి చెందాడు సుందరం. ఏ నిర్వచనానికీ లొంగని భావోద్రేకంతో కదిలి పోయాడు. తను పుట్టిన గడ్డ మీద ఎన్నో సంవత్సరాల తర్వాత అడుగు పెట్టడం అతనికి వింత అనుభవంలా తోచింది. తాత గారి మరణంతో తమకి ఈ ఊరితో అనుబంధం తెగి పోయి అప్పుడే దాదాపు నలభయ్ అయిదేళ్ళు కావస్తోంది. మామయ్యలూ, పిన్నీ అంతా తలో దిక్కుకీ చెదిరి పోయారు. అమ్మమ్మ చివరి ఊపిరి తన తండ్రి చేతుల్లోనే వదిలింది. తండ్రి ఉద్యోగం కోస్తా జిల్లాలలో మారు మూల. తాత గారి ఊరుతో తనకే కాక అమ్మ వేపు బంధువులకి కూడా ఋణం తీరి పోయింది. అంతా ఈ గ్రామానికి కొన్ని వందల మైళ్ళ దూరం చెదిరి పోయారు. దాదాపు అందరూ మరచిపోయారు - తను మాత్రం మెదడు పొరల్లో నిక్షిప్తమైన ఆ జ్ఞాపకాలని మరచి పోలేకపోయాడు.

పెరిగిన బాధ్యతలతో, జీవిత పోరాటంలో అలసిపోయిన తను, మళ్ళీ ఆ గ్రామం చూడగలడని ఊహించనయినా లేదు. అనుకోకుండా అవకాశం చిక్కింది. ఉబ్బి తబ్బిబ్బయి పోయాడు. ఇక్కడికొచ్చి వాలాడు. తీరా గ్రామం లోకి అడుగు పెట్టిన తను, ఆ ఇంటిని ఎలా కనుక్కోగలడనే సందేహం మొదటి సారి మొలకెత్తింది సుందరానికి. తెలీని ఉద్వేగంతో వచ్చేసాడే కాని, ఆ చిన్నప్పటి ఇంటిని కనుక్కోవడం ఎలాగ?

అదంత సులభ సాధ్యమైన విషయం కాదనిపించింది సుందరానికి. ఆ ఇల్లు, ఇంటి వాతావరణమైతే స్పష్టంగా గుర్తుంది. కానీ, అదెక్కడుందో ఊహ కందడం లేదు. తన పసితనపు అనుభూతులన్నీ ఆ ఇంటితోనే పెనవేసుకుని పోయాయి తప్ప,ఊర్లో తక్కిన ప్రదేశాలేవీ తనకి పరిచిత పూర్వాలు కావు. మరెలా ఆ ఇంటిని గుర్తు పట్టడం? ఇంతకీ ఆ ఇల్లు పూర్వంలాగే ఉండి ఉంటుందని తనెలా అనుకున్నాడో సుందరానికి ఓ పట్టాన అర్థం కాలేదు. ఆ పాత పెంకుటింటి స్థానంలో ఏ భవనం వెలిసిందో ? ఆ ఇల్లు ఎన్ని మార్పులకి లోనయిందో? ఈ విషయం ఇంతవరకూ తనకి స్ఫురించనందుకు సుందరం చకితుడయ్యాడు. తన మనసులో ఈ ఇల్లు ఏ మార్పూ చెందకుండా పచ్చగా ఉండాలనే కోరిక స్ఫుటంగా నిబిడీకృతం కావడం వల్లనేకాబోలు, తనకా ఆలోచన రాలేదు. సుందరానికి నవ్వొచ్చింది. అయినా పట్టుదల సడల లేదు. ఆ ఇంటిని వెతుక్కుంటూ ఊరంతా తిరిగాడు. వీధి వీధీ గాలించి చూసాడు. మూల మూలలూ జల్లెడ వేసినట్టు పరిశీలించాడు. అలుపూ సొలుపూ లేకుండా తిరిగేడు. పిచ్చి పిచ్చిగా తిరిగాడు. బరువెక్కిన గుండెతో, చెమ్మగిల్లిన కళ్ళతో, తన చిన్నప్పటి ఇంటి కోసం వెతుక్కున్నాడు.

ఎంత తిరిగినా ఆ ఇల్లు కనబడ లేదు. సుందరం కనీసం - ఆ ఇల్లు ఉండే పరిసరాలని కూడా పోల్చుకో లేక పోయాడు. ఊరంతా కొత్త కొత్త బిల్డింగులు లేచాయి. ఊరు ఆ ఏభై యేళ్ళలో తెగ బలిసి పోయింది. అక్కడా అక్కడా కొన్ని పాత ఇళ్ళు కనిపించినా, వాటిలో తన ఇల్లు లేదు. తన బాల్యం తన ఎదుటనే తునా తునకలై పోయినట్టయింది సుందరానికి. తన గుండె పొరల్లోంచి, ఒక అందాన్ని - ఒక అద్భుతాన్ని, ఎవరో బలవంతాన పెకిలించి వేసి నట్టయింది. ఇంతకన్నా దారుణమైన ఓటమి జీవితంలో ఉండదేమో అనిపించింది. ఎంతో పదిలంగా దాచుకున్న ఊహల విరజాజి వాడి వత్తలైంది. బాల్యం బ్రద్దలైంది.

జన్మనిచ్చిన అమ్మ ఆ ఇంట్లోనే కన్ను మూసింది. ఆ సన్న జాజి పందిరి కిందే ఉగ్గు పట్టింది అమ్మ! ఆ గన్నేరు పూలు తన చేత ఏరిస్తూ ఎన్నో ఊసులు చెప్పేది అమ్మ. ఆ యింటిని చూడగలిగితే అమ్మని మళ్ళీ చూసినంత తృప్తి తనకి దక్కేది.

సుందరం గుండె ఆవేదనతో బరువెక్కింది. ఆ సుందర స్వప్నాన్ని తనకి కనబడ నీయకుండా ఎవరు చెరిపేసారు? అతని మనసు బాధగా మూలిగింది. ఎండ రాను రాను తీక్షణ మవుతోంది. ఎండ వేడిమినీ, ప్రయాసనీ లక్ష్య పెట్టే స్థితిలో లేదు సుందరం. రెట్టించిన పట్టుదలతో మరోసారి ఊరంతా చుట్టబెట్టాడు. ఫలితం శూన్యం. నిస్త్రాణగా ఓ చోట స్తబ్దంగా నిలబడి పోయాడు. సరిగ్గా ఆ పరిస్థితిలో అతని దగ్గరి కొచ్చాడు, బుగ్గమీసాల పోలీసు కానిస్టేబిలు. అనుమానంగా సుందరం కళ్ళలోకి సూటిగా చూసాడు. ఉదయం నుంచీ తిరిగి తిరిగి అలసిపోయాడేమో - సుందరం రూపం మరింత వికారంగా తయారయింది. మాసిన బట్టలూ, చెమటతో జిడ్డుకారుతున్న ముఖం, భుజాన వేలాడుతూన్న సంచీ - అతనిలో ఏ సందేహాలని రేకెత్తించాయో...దగ్గరి కొచ్చి ఆరాలు తీయడం ప్రారంభించాడు. సుందరం మాట్లాడే కోస్తా జిల్లాల యాస విని, వింతగా చూసాడు. అతికీ అతకని భావ ప్రకటనలతో అతను చెప్పే మాటలు ఆ పోలీసులో అనుమానాన్ని మరింతగా బలపరిచాయి.

తన వెంట స్టేషనుకి రమ్మని హుంకరించాడు. పరిస్థితి అర్థం కావడం మొదలయే సరికి, సుందరంలో కలవరపాటు మొదలయింది. ఏదో చెప్పడానికి ప్రయత్నించాడు. దీనంగా వేడుకున్నాడు. చేతులెత్తి దండం పెట్టాడు. అతను బలవంతంగా జబ్బ పట్టుకుంటే పెనుగులాడేడు. చుట్టూ జనం మూగి, పరిస్థితి మరింత గంటరగోళంగా తయారయింది. తలోకరూ తలో వ్యాఖ్యానం చేసారు. మొత్తానికి అందరూ కలసి, సుందరాన్ని దోషిగా నిలబెట్టేసారు. ఇటీవల గ్రామంలో పెచ్చు పెరిగి పోతున్న జేబు దొంగతనాలకు బాధ్యత అతని మీదకు నెట్టారు. ఉన్నట్టుండి పేదలు ఉండే ప్రాంతాలలో గుడిసెలు భగ్గున అంటు కోడానికి కారణం సుందరమే అని తీర్మానించేరు.

తీవ్రవాది కాబోలని సందేహించిన వాళ్ళూ లేక పోలేదు.

సుందరం నిలువునా క్రుంగిపోయాడు. అతనికి జవసత్వా లుడిగి పోయినట్ల యింది. మనిషి అచేతనుడయ్యాడు. సుందరాన్ని నెట్టుకుంటూ పోలీసు స్టేషనుకి దారి

తీసాడు – బుర్ర మీసాల పోలీసు. అవమానంతో, ఆరాటంతో, సిగ్గుతో తల కుదించుకు పోగా అతని వెంట నడిచాడు సుందరం.

* * *

అలికిడి వినిపించి బరువుగా కళ్ళు తెరిచాడు సుందరం. స్టేషన్లో జవాన్లు ముందు గదిలోకి చేరారు. ఎస్సై వచ్చాడు. తనున్న చోటు నుంచి కొంచెం ముందుకి వంగి చూస్తే, అతని ముఖం కనిపిస్తోంది సుందరానికి. ఎస్సై వయసులో చిన్న వాడే. ముఖంలో కాఠిన్యం అంతగా కనిపించడం లేదు. వృత్తి లోని కఠినత్వం అతన్నింకా కల్మష పరిచినట్టు లేదు. తన మొర వింటాడనే ఆశ చిగురించింది సుందరం మనసులో. ముఖాన పట్టిన చెమట జిడ్డు అరచేతులతో రుద్దుకున్నాడు. లేవబోయాడు. నీరసంతో శరీరం తూలినట్టయింది. మళ్ళీ బెంచీ మీద కూలబడ్డాడు.

ఎస్సై నుంచి తనకి కబురొస్తుందని క్షణాలు లెక్కపెట్టుకుంటూ కూచున్నాడు. నిముషాలు బరువుగా గడుస్తున్నాయి. చాలా సేపటికి – సుందరాన్ని స్టేషనుకి లాక్కుని వచ్చిన కానిస్టేబిలు ఎస్సైతో ఏదో చెప్పాడు. మరో పది నిముషాలకి సుందరానికి ఎస్సై నుంచి రమ్మని కబురొచ్చింది. పడుతూ లేస్తూ వెళ్ళి ఎస్సై టేబిలు ముందు నిల్చున్నాడు సుందరం. ఎస్సై లోతుగా సుందరం కళ్ళలోకి చూసాడు. సంగతేమిటన్నట్లు కళ్ళెగరేసాడు. తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే ఆఖరి అవకాశాన్ని చెయ్యి జారిపోనివ్వదల్చలేదు సుందరం. అతనిలో లేని తెగింపు పుట్టుకొచ్చింది.

ఒక్కొక్క మాటా పేర్చుకుంటూ, అయినా, సూటిగానే, తన వైనం అంతా పూస గుచ్చినట్టు చెప్పుకొచ్చాడు. అంతా చెప్పి, చివరికి..."సార్!... నన్ను నమ్మండి. చిన్న చిన్న అనుభూతుల కోసం వెంపర్లాడే సగటు ప్రాణం సార్ నాది! నా చిన్నప్పటి ఇంటినీ, అక్కడే చచ్చిపోయిన మా అమ్మ స్మృతుల్నీ, నా బాల్యాన్నీ చూసుకోవాలనే ఆరాటంతో ఊరంతా తిరిగేను సార్... చేవ చచ్చిన జీవితంలో చేదు మిగిల్చే వర్తమానం నుండీ ఒక్క సారి... ఒకే ఒక్క సారి... పసితనపు మిసిమి ఛాయల్లోకి తొంగి చూద్దామన్న ఉబలాటం తప్ప – మరే నేర ప్రవృత్తీ నాకు లేదు సార్. నన్ను నమ్మండి..." అని వేడుకున్నాడు. దగ్గుత్తికతో సుందరం గొంతు జీరబోయింది.

ఎస్సై వదనంలో గాంభీర్యం చోటునే రవంత ప్రసన్నత చోటు చేసుకుంది. మంచి నీళ్ళు తెప్పించి సుందరం చేత తాగించాడు. ఓదార్పుగా చూస్తూ కూచోమని కుర్చీ చూపించాడు. సుందరం కాస్త స్తిమిత పడ్డాక తక్కిన వివరాలడిగేడు.

"అన్నట్టు మీ తాత గారి పేరేమిటన్నారు? ఈ ఊళ్ళో అతనేం చేస్తుండేవారు?" అని.

"మా తాత గారి పేరు లక్ష్మణ మూర్తి గారు. ప్రయివేటు డాక్టరు. అంతా 'డాక్టరు బాబాయ్' అనే వారు." చెప్పాడు సుందరం.

ఆ మాట వింటూనే చప్పున లేచి నించున్నాడు ఎస్సై. "వాటె సర్ప్రైజ్! డాక్టరు బాబాయ్ గారు మీ తాత గారా! మా నాన్నగారు చెబుతూ ఉండేవారు. వారి తండ్రి గారు, అంటే, మా తాత గారు తీవ్రంగా జబ్బు పడి నప్పుడు వైద్యం చేసి, ప్రాణ దానం చేసి రక్షించింది డాక్టరు బాబాయ్ గారేనట! వారి గురించీ, వారి మంచి తనం గురించీ మా నాన్న గారు ఎన్నో సార్లు చెబుతూ ఉండేవారు. అయితే, ఉద్యోగరీత్యా నేనీ ఊరు రావడమే తప్ప, నేను లోగడ యిక్కడకి రాలేదు. చాలా సంతోషం... మీ మనసు మా వాళ్ళ వల్ల గాయ పడితే మన్నించండి. మిమ్మల్ని అనుమానించి తీసుకొచ్చి మీ మనసెంత గాయ పరిచాడో, మా కానిస్టేబిలు. అందుకు నేను సిగ్గు పడుతున్నాను..." అంటూ ఏవేవో చెప్పాడు.

సుందరానికి ఆ మాటలు సంభ్రమంగానూ, తట్టుకోలేనంత సంతోషంగానూ అనిపించాయి. తరువాత ఆ మాటా యీ మాటా మాట్లాడుకున్నాక, సుందరాన్ని సాదరంగా వీడ్కోలిచ్చి పంపించాడు ఎస్సై.

తను ఆశించింది సాంతం నెరవేరక పోయినా, అదో విధమైన తృప్తితో బస్సెక్కాడు సుందరం.

* * *

సుందరాన్ని సాగనంపి, స్టేషను గదిలోకి తిరిగి వచ్చిన ఎస్సైని చూస్తూ వింతగా కళ్ళప్పగించి ఉండిపోయాడు బుర్ర మీసాల పోలీసు కానిస్టేబులు. జరిగిన తప్పిదంలో తన భాగస్వామ్యం ఎంతో నిర్ధారించుకోలేక, నీళ్ళు నములుతూ 'సార్...' అంటూ ఏదో చెప్పబోయాడు.

అతన్ని కళ్ళతోనే వారించి, ఎస్సై యిలా అన్నాడు : "చూడు... అనుమానించడం మన వృత్తి లక్షణమే అయినా, దానికీ కొన్ని హద్దులుంటాయి. నేరస్థుడ్ని వెతికి పట్టుకోవడం ఎంత ప్రధానమో – ఒక నిరపరాధి నిర్దోషిత్వాన్ని సకాలంలో సక్రమంగా గుర్తించడం కూడా అంతే ముఖ్యం.. ఏమంటావు?" ఆ మాటలలో సత్యాన్ని అంగీకరిస్తూ , కానిస్టేబిలు తలూపేడు. ఆ తరువాత ఏదో గుర్తొచ్చినవాడిలా "అయితే...సార్...మీ తాత గారు..." అంటూ ఏదో అడగబోయి, సందిగ్ధంలో ఉండి పోయేడు. ఎస్సై అతని ముఖంలోకి చూసి, చిరు నవ్వు నవ్వేడు. సమాధానం చెప్ప లేదు. అతన్ని చూస్తే, అతను సుందరంతో చెప్పినదంతా అబద్ధమేనని స్పష్టమైపోతూనే ఉంది ఆ కానిస్టేబిలుకి.

అయితే ...

ఎస్సై గారతనితో ఏ ప్రయోజనాన్ని ఆశించి అతన్ని మభ్య పెట్టారో ఆ బుర్ర మీసాల పోలీసుకి ఎంతగా తల చించుకున్నా అర్థం కాలేదు. కాదు కూడా!

* * *

*ఆంధ్ర ప్రభ, సచిత్ర వార పత్రిక 6 - 6 -1990 సంచికలో ప్రచురణ.*